www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 16 డిసెంబర్ 2024

5

కాకినాడ



నేడు యథావిధిగా పిజిఆర్ఎస్ కార్యక్రమం

ప్రజాశక్తి - కాకినాడ

నియోజక వర్గం స్థాయిలో నేడు నేడు పిజిఆర్ఎస్ కార్యక్రమాన్ని పిఠాపురంలో నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 10 గంటల నుంచి 1 గంట వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. పిఠాపురంలో జరిగే సమావేశంలో తనతోపాటు, వివిధ శాఖలకు చెందిన జిల్లా దిగువ స్థాయి అధికారులు, డివిజన్ స్థాయి అధికారులు, నియోజకవర్గ స్థాయి అధికారులు పాల్గొంటారని అన్నారు. ఉదయం 9.30 నిమిషాలకు పిఠాపురం రథాలు పేట అంబేద్కర్ కమ్యునిటి హాలులో జరిగే కార్యక్రమానికి హాజరు కావాలని కలెక్టర్ ఆదేశించారు. అలాగే జిల్లా స్థాయిలో జరిగే పిజిఆర్ఎస్ కార్యక్రమం కలెక్టరేట్ గ్రీవెన్స్ హాలులో, మండల స్థాయిలో జరిగే కార్యక్రమం ఉదయం10 గంటల నుంచి 1 గంట వరకు యథావిధిగా జరుగుతుందని కలెక్టర్ తెలిపారు.

నేతల కనుసన్నల్లో 'పల్లె పండుగ'

- ఇష్టారాజ్యంగా సిసి రోడ్ల నిర్మాణాలు
- కార్యకర్తల గృహాలకే అధిక ప్రాధాన్యత
- వెనుకబడిన ప్రాంతాల పట్ల నిర్లక్ష్యం



కరప మండలం గొంగోడు గ్రామంలో నిర్మిస్తున్న సిసి రోడ్డు

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

జిల్లాలో 'పల్లె పండుగ' పేరుతో కూటమి ప్రభుత్వం పెద్దఎత్తున సిసి రోడ్లు, డ్రెయినేజీలను నిర్మిస్తోంది. గత ప్రభుత్వంలో అభివృద్ధికి నోచుకోని ప్రాంతాలకు రోడ్ల పనులను చేపడుతున్నట్లు కూటమి నేతలు చెప్పుకొస్తున్నారు. అయితే చేపడుతున్న పనులన్నీ కూటమి నేతల ఇష్టారాజ్యంగా సాగుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పలు ప్రాంతాల్లో టిడిపి, జనసేనకు చెందిన నేతలు, కార్యకర్తలు నివాసముండే ఇళ్లకు వెళ్లే మార్గాలకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. ఉపాధి హామీ పథకం కాంపోనెంట్ నిధులతో చేపడుతున్న పనుల్లో వెనుకబడిన ప్రాంతాలకు ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉంది.

ఆర్భాటంగా పనులు ప్రారంభం

ఆగస్టు 23న ఒకే రోజు జిల్లాలోని 385 పంచాయతీల్లో నిర్వహించిన గ్రామసభల్లో ఆమోదం పొందిన పనులను ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో అక్టోబర్ 14 నుంచి 21 వరకు పల్లె పండుగ పేరుతో జిల్లాలోని పలు గ్రామాల్లో సిసిరోడ్లు, డ్రెయినేజీ నిర్మాణాలకు శంకుస్థాపన కార్యక్రమాలు ఘనంగా చేపట్టారు. ఎక్కడెక్కడ సిసి రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణాలు చేపట్టాలో మండలస్థాయిలో ఎంపిడిఒల ఆధ్వర్యంలో ఇప్పటికే గుర్తించారు. వీటిని నామినేటెడ్ పద్ధతిలో చేపట్టారు. పంచాయతీ రాజ్ శాఖ అధికారుల పర్యవేక్షణలో జరుగుతున్నాయి. జాతీయ ఉపాధి హామీ పథకంలో మెటీరియల్ కాంపోనెంట్ నిధులను ఈ నిర్మాణాలకు వినియోగిస్తున్నారు. దీనికి అదనంగా 15వ ఆర్థిక సంఘం, గిరిజన ఉప ప్రణాళిక నిధులు కేటాయిస్తున్నారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాలు, విలీనమైన మూడు మండలాల్లో రూ.94.28 కోట్లతో 1,43,973 మీటర్ల పొడవున 1009 పనులను చేపట్టారు. వీటిలో దాదాపు 860 పనులను ఇప్పటికే ప్రారంభించారు. జనవరి నెలాఖరులోపు పూర్తి చేయాలనే లక్ష్యంగా అధికారులు పనులు నిర్వహిస్తున్నారు. ఆన్‌లైన్ రిపోర్ట్ వివరాలు ప్రకారం ఇప్పటి వరకు సుమారు 80 పనులు మాత్రమే పూర్తి అయ్యాయి.

వారు చెప్పిన చోట్లే పనులు

రాష్ట్ర డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ చొరవతో గ్రామాల్లో సిసి రోడ్లు, డ్రెయినేజీ నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయి. అయితే అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంటున్న ప్రాంతాలను ఈ సందర్భంగా అభివృద్ధి చేయాల్సి ఉంది. అందుకు అనుగుణంగా ప్రాధాన్యత క్రమంలో పనులను అధికారులు గుర్తించాల్సి ఉంది. కానీ జిల్లాలో అనేక ప్రాంతాల్లో కూటమి నేతలు చెప్పిన ప్రాంతాల్లో మాత్రమే పనులు నిర్వహిస్తున్నారని పలు గ్రామాల ప్రజలు విమర్శిస్తున్నారు. ఉపాధి హామీ పథకం మెటీరియల్ కాంపోనెంట్ నిధులతో సిసి రోడ్ల నిర్మాణం చేపడుతున్నప్పటికీ వెనుకబడిన ప్రాంతాలను పూర్తిగా విస్మరిస్తున్నారని ఆరోపణలు అధికారులపై వెలువెత్తుతున్నాయి. టిడిపి, జనసేన పార్టీల స్థానిక నేతలు సూచించిన ప్రాంతాల్లో మాత్రమే నిర్మాణాలు సాగుతున్నాయి. ఉదాహరణకు డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గంలో పనులు ప్రాధాన్యతా క్రమంలో పనులు జరగడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పిఠాపురం మండలం మల్లాంలో రూ.15 లక్షలతో 7 చోట్ల చిన్నచిన్న సిసి రోడ్లు వేస్తున్నారు. ఇక్కడ కేవలం ఎస్‌సి కాలనీలో ఒక రోడ్డు మాత్రమే వేస్తున్నారు. మిగిలిన రోడ్లన్నీ కూటమి కార్యకర్తలు ఉన్న ప్రాంతాల్లోనే నిర్మిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. పి.తిమ్మాపురంలో ప్రాధాన్యతను పక్కన పెట్టి ఒక రోడ్డు టిడిపి నేత నివాస గృహాలు ఉన్న ప్రాంతంలో నిర్మిస్తున్నారు. ఎఫ్.కె.పాలెంలో రూ.35 లక్షలతో 6 సిసి రోడ్ల పనులు చేపట్టారు. ఇక్కడ కూడా ప్రాధాన్యతా క్రమాన్ని పక్కనపెట్టి ఇద్దరు జనసేన కార్యకర్తల ఇళ్ల వద్ద సిసి రోడ్లు నిర్మిస్తున్నట్లు గ్రామస్తులు విమర్శిస్తున్నారు. పి.రాయవరంలో సుమారు రూ.26 లక్షలతో 7 రోడ్లు వేస్తున్నారు. ఒక కాలనీలో 5 రోడ్లు, ఎస్‌సి కాలనీలో రెండు నిర్మిస్తున్నారు. ఇదే మండలం జల్లూరులో రూ.21 లక్షలతో రెండు రోడ్లు వేస్తుండగా ఒక రోడ్డు జనసేన కార్యకర్త ఇళ్లకు వెళ్లే మార్గంలో నిర్మిస్తున్నారు. ఈ గ్రామంలో పలుచోట్ల సిసి రోడ్లు లేని పరిస్థితి ఉన్నప్పటికీ కేవలం అర డజను కుటుంబాలు మాత్రమే నివాసముంటున్న చోట రోడ్డు వేస్తుండడంపై విమర్శలు వెలువెత్తుతున్నాయి. ఇలా జిల్లాలో అనేక ప్రాంతాల్లో కూటమి నేతలు చెప్పిన చోట్ల, అలాగే పార్టీ కార్యకర్తల ఇళ్లకు వెళ్లే మార్గాల్లో రహదారుల నిర్మాణాలు చేపడుతుండడం విమర్శలకు దారితీస్తుంది. కూటమి నేతల ఇష్టారాజ్యంగా జరుగుతున్న పనుల తీరుపై అధికారులు ఉదాసీనంగా వ్యవహరించడంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

ఎస్‌సి పేటలను అభివృద్ధి చేయాలి

రాష్ట్రంలో పల్లె పండుగ పేరుతో జరుగుతున్న సిసి రోడ్లు, డ్రెయినేజీ పనులకు ఉపాధి హామీ పథకం నిధులను ఖర్చు చేస్తున్నారు. అయితే ఉపాధి కూలీ పనులు చేసే కూలీలు నివసించే ప్రాంతాల్లో వేయకపోవడం దారుణం. ముఖ్యంగా ఎస్‌సి పేటలకు తగిన ప్రాధాన్యత ఇవ్వడం లేదు. దీనిపై అడిగితే మీకు సబ్ ప్లాన్ నిధులు ఉన్నాయి వాటితో వేస్తాం అంటున్నారు. ఇది కరెక్ట్ కాదు. ఎస్‌సి పేటలు నేటికీ రోడ్లు, డ్రెయిన్లు, స్మశానాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. కావున ఈ నిధులను ప్రధానంగా ఎస్‌సి, బిసి నివాసిత ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలి.

-కెఎస్.శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం.



ఆసుపత్రిలో మృతి చెందిన కారదాల చంద్రరావు

ఉలికి పడిన వేట్లపాలెం..

-స్థల వివాదంతో ప్రత్యర్థులపై దాడి

-ముగ్గురు హతం, పలువురికి గాయాలు -ఇద్దరి పరిస్థితి విషమం

ప్రజాశక్తి - సామర్లకోట

కత్తులు, కర్రలతో ఒక్కసారిగా చేసిన దాడిలో ముగ్గురి ప్రాణాలు గాల్లో కలిసిపోయాయి. మరో ఐదుగురు తీవ్ర గాయాలపాలయ్యారు. వీరిలో ఇద్దరి పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు ఆసుపత్రి వర్గాలు వెల్లడించాయి. ఆదివారం రాత్రి సామర్లకోట మండలం వేట్లపాలెంలో జరిగిన ఈ సంఘటన జిల్లాను ఉలికిపాటుకు గురిచేసింది.

వేట్లపాలెం గ్రామ శివారులోని దళితపేటకు చెందిన చెరువును గ్రామానికి చెందిన కారదాల కుటుంబీకులు ఆక్రమించి గృహాన్ని నిర్మిస్తున్నారని అదే గ్రామానికి చెందిన బచ్చల కుటుంబ సభ్యులు పంచాయతీ కార్యాలయంలో ఫిర్యాదులు చేశారు. గత 3 నెలలుగా ఈ వివాదం రెండు కుటుంబాల మధ్య సాగుతోంది. ఆదివారం రాత్రి కారదాల కుటుంబ సభ్యులు ఇంటి నిర్మాణానికి సంబంధించి స్లాబ్ పనులు చేస్తుండగా బచ్చల కుటుంబానికి చెందిన వ్యక్తులు కత్తులు, కర్రలు, ఇనుప రాడ్లతో ఒక్కసారిగా కారదాల కుటుంబంపై దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో కారదాల ప్రకాశ రావు(45) అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన కారదాల చంద్రరావు(60) సామర్లకోట ప్రభుత్వాసుపత్రిలో మృతి చెందాడు. కారదాల యేసుబాబు(45) కాకినాడ జిజిహెచ్‌లో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో దుర్మరణం చెందాడు. ప్రత్యర్థుల దాడిలో గాయపడిన కారదాల పండు, కారదాల దావీదు, కారదాల బాబి, కారదాల చిన్నోడు, కారదాల సత్యవేణి, కారదాల అచ్చయ్య, కారదాల సంజీవరావు తదితర ఏడుగురు చికిత్స పొందుతున్నారు. బచ్చల సుబ్బారావు మరో అయిదుగురు తమపై దాడికి దిగారని మృతుల బంధువులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం మధ్యాహ్నం 3 గంటల నుంచి స్లాబ్ నిర్మాణం పనుల్లో నిమగ్నమై ఉన్న తమ కుటుంబ సభ్యులను రాత్రి 7 గంటల ప్రాంతంలో ఒక్కసారిగా బచ్చల కుటుంబీకులు దాడి చేశారని బాధిత కుటుంబ సభ్యులు పోలీసులకు తెలిపారు. పెద్దాపురం డిఎస్‌పి శ్రీహరి రాజు ఆధ్వర్యంలో సామర్లకోట సిఐ ఎ.కృష్ణ భగవాన్ దర్యాప్తు ప్రారంభించారు. మృతుల బంధువుల నుంచి వివరాలు సేకరించారు. రాత్రి పదిన్నర గంటలకు ఎస్‌పి విక్రాంత్ పాటిల్ వేట్లపాలెంలోని సంఘటన ప్రాంతానికి చేరుకుని పరిశీలించారు.



రోధిస్తున్న కుటుంబ సభ్యులు



సంఘటనా ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎస్‌పి విక్రాంత్‌పాటిల్



దీక్ష చేస్తున్న ఇంజినీరింగ్ ఔట్ సోర్సింగ్ కార్మికులు

7వ రోజుకు ఇంజినీరింగ్ కార్మికుల సమ్మె

ప్రజాశక్తి - పెద్దాపురం

మున్సిపల్ ఇంజినీరింగ్ ఔట్‌సోర్సింగ్ కార్మికులు చేపట్టిన సమ్మె ఆదివారం నాటికి 7వ రోజుకు చేరింది. మున్సిపల్ కార్యాలయం వద్ద ఏర్పాటుచేసిన సమ్మె శిబిరంలో యూనియన్ అధ్యక్షుడు సుంకర నాగేశ్వరరావు మాట్లాడుతూ ఇంజినీరింగ్ ఔట్‌సోర్సింగ్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, టెక్నికల్ ఉద్యోగులకు రూ.29,200, నాన్ టెక్నికల్ ఉద్యోగులకు రూ.24,500 వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మృతి చెందిన కార్మికుల కుటుంబానికి రూ.10 లక్షలు, వైకల్యం పొందిన వారికి రూ.5 లక్షలు, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలన్నారు. హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. తక్షణమే ప్రభుత్వం తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. ఈ సమ్మె శిబిరంలో నాగేశ్వరరావు, రమణ, రామకృష్ణ, స్వామి, భాస్కర్, భద్రరావు, సాయి కృష్ణ, జి.నాగేశ్వరరావు, ఎస్.కె బషీర్, శివ, ఎం.భద్రరావు, రవిచంద్రకుమార్, సతీష్, సత్తిరాజు, శ్రీను పాల్గొన్నారు.

జీడిపిక్కల కార్మికులకు ప్రజా సంఘాల మద్దతు

ప్రజాశక్తి - ఏలేశ్వరం



నిరసన శిబిరంలో మాట్లాడుతున్న ప్రజా సంఘాల నాయకులు

చిన్నింపేట జీడి పిక్కల ఫ్యాక్టరీని తెరిపించాలని ఆందోళన నిర్వహిస్తున్న కార్మికులకు వివిధ ప్రజా సంఘాల నాయకులు ఆది వారం మద్దతు ప్రకటించారు. ఫ్యాక్టరీ వద్ద ధర్నా నిర్వహిస్తున్న కార్మికులకు వద్దకు ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి చంద్ర మౌళి పద్మ, మధ్యాహ్న భోజన కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి తమ కార్యకర్తలతో చేరుకుని సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీడి పిక్కల ఫ్యాక్టరీ కార్మికులు గత నెల రోజులుగా పోరాడుతున్న ప్రభుత్వం కనీసం పట్టించుకోక పోవడం దారుణమ న్నారు. తక్షణమే ఫ్యాక్టరీ తెరిపిం చి 409 మంది కార్మికులకు ఉపాధి కల్పించాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున స్కీం వర్కర్లు కార్మికులకు మద్దతుగా రోడ్డుపై కి వస్తారని హెచ్చరించారు. యాజమాన్యం తమ స్వార్థ ప్రయోజ నాల కోసం ఫ్యాక్టరీని మూసివేస్తే చూస్తూ ఊరుకునే ప్రసక్తి లేదన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా వర్కింగ్ కమిటీ సభ్యుడు రొంగల ఈశ్వరరావు, ఆశ వర్కర్స్ యూనియన్ నాయకులు పార్వతి, సిహెచ్.సత్య, కార్మిక నాయకులు ఎ వీరబాబు, చక్రధర్, గోవిందు, ధర్మాజీ, ఆది, కృష్ణారావు, శివ దుర్గాప్రసాద్, రామదుర్గ, జయలక్ష్మి, అన్నపూర్ణ, శివలక్ష్మి, దేవి, చంటి, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరంలో ఉచిత సేవలు

ప్రజాశక్తి - ఏలేశ్వరం



కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

స్థానిక సాయి శంకర్ నేత్రాలయ ఆవరణలో ఏలేశ్వరం లయన్స్ క్లబ్, కాకినాడ కిరణ్ కంటి ఆసుపత్రి సంయుక్తంగా ఆదివారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరంలో 200 మంది రోగులకు సేవలు అందించారు. ఈ శిబిరాన్ని ప్రకృతి పరిరక్షణ సంఘం అధ్యక్షులు డాక్టర్ సఖిరెడ్డి విజయబాబు ప్రారంభించారు. ఈ శిబిరంలో ప్రముఖ నేత్ర వైద్యులు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ అనసూరి నాగేశ్వరరావు, కిరణ్ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ అవని, డాక్టర్ వెంకట అనూష వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు కళ్ళజోళ్ళు అందజేశారు. వీరిలో 30 మందికి ఐఒఎల్ ఆపరేషన్ నిమిత్తం కాకినాడ కిరణ్ ఆసుపత్రికి తరలించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు జ్యోతుల నాగ సత్య శ్రీనివాస్, అలమండ దుర్గాప్రసాద్, కప్పల నాగభూషణం, గొల్లపూడి గణేష్, జామి సూర్యప్రకాష్, తాండూరి రాము, తాళ్లూరి గొల్లాజీరావు పాల్గొన్నారు.

తాళ్లరేవు డిసి ఛైర్మన్‌గా భాస్కరరాజు

ప్రజాశక్తి - తాళ్లరేవు



డిసి ఛైర్మన్, వైస్ ఛైర్మన్లను అభినందిస్తున్న ఎంఎల్ఎ దాట్ల

మండల డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఛైర్మన్‌గా వేగేశ్న భాస్కర రాజు, వైస్ ఛైర్మన్‌గా మొగలతుర్తి శ్రీనివాస రావులను ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు ప్రకటించారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఛైర్మన్, వైస్ ఛైర్మన్ అభ్యర్థులను దుస్సాలువతో సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రాయుడు సునీత, నాయకుల టేకుమూడి లక్ష్మణరావు, కట్ట త్రిమూర్తులు, విళ్లవీరా, మందాల గంగ సూర్యనారాయణ, నడింపల్లి వినోద్, పలు సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా కుడా ఛైర్మన్ తుమ్మల ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి - కాకినాడ



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న తుమ్మల రామస్వామి

కుడా నూతన ఛైర్మన్‌గా నియమితులైన తుమ్మల రామస్వామి కూటమి ఎంఎల్ఎలు, నాయ కులు, కార్యకర్తల మధ్య అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా యనమల రామకృష్ణుడు, నిమ్మకాయ చినరాజప్ప, పంతం నానాజీ, ఎంపి తంగేళ్ల ఉదయ శ్రీనివాస్, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, టిడిపి జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్‌కుమార్ సమక్షంలో కుడ కార్యా లయం ఎదురుగా ఏర్పాటు చేసిన వేదికపై ప్రమాణ స్వీకారం చేశారు. ఈ ప్రమాణ స్వీకార మహోత్స వంలో వక్తలు మాట్లాడుతూ తుమ్మల రామస్వామి గత 25 సంవత్సరాలుగా రాజకీయంలో ఉండి పేద బడుగు బలహీన వర్గాలకు అండదండలుగా ఉన్నారని అనాక్నరు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో అందరితో పరిచయమైన వ్యక్తని కూటమి నాయకుల గెలుపునకు ఎనలేని కృషి చేశారని కొనియాడారు. ఛైర్మన్ రామస్వామి మాట్లాడుతూ తనపై నమ్మకంతో తమ నాయకుడు పవన్ కళ్యాణ్ తనకు అప్పగించిన బాధ్యతను మచ్చలేకుండా నిర్వహిస్తానన్నారు. తన ప్రమాణ స్వీకారానికి వచ్చిన ఎంపి, ఎంఎల్‌సి, ఎంఎల్‌ఎలు, బంధుమిత్రులకు, కార్యకర్తలకు కృత జ్ఞతలు తెలిపారు. ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో వేగుళ్ల లీలాకృష్ణ, పేరాబత్తుల రాజశేఖర్, అడబాల సత్యనారాయణ, కడలి ఈశ్వరి, తుమ్మలపల్లి రమేష్, పాల్గొన్నారు.

విధుల పట్ల అలసత్వం వహిస్తే చర్యలు

ప్రజాశక్తి - శంఖవరం



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఇఒ

దేవస్థానంలోని అన్ని విభాగాలకు చెందిన ఉద్యోగులు విధులు పట్ల అలసత్వం వహిస్తే ఖఠిన చర్యలు తీసుకుంటానని అన్నవరం దేవస్థానం కార్య నిర్వహణఅధికారి వీర్ల సుబ్బారావు హెచ్చరించారు. ఆదివారం తన కార్యాలయంలో వివిధ విభాగాల అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఎన్ని విభాగాలు ఉన్నాయి? ఏ విభాగాల్లో పాలన, అభివృద్ధి, ఆదాయం అంశాలపై ఆయన ఆరా తీశారు. ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో చేపడుతున్న నిర్మాణాలకు సంబంధించిన నాణ్యత ప్రమాణాలపై ఆరా తీశారు. లీజులు విభాగంలో ల్యాండ్స్, బకాయిల గురించి అడిగి తెలుసుకున్నారు. అవినీతి అక్రమాలకు ఏ ఉద్యోగి పాల్పడిన క్రమశిక్షణ చర్యలు కఠినంగా ఉంటాయని, దానిని దృష్టిలో పెట్టుకుని ఉద్యోగులు పనిచేయాలని ఆయన హెచ్చరించారు. ఈ సమావేశంలో డిసి చంద్రశేఖర్, ఎసి రామ్మోహనరావు, ఎఇఒలు, పర్యవేక్షణ అధికారులు, పిఆర్ఒ కొండల్ రావు పాల్గొన్నారు.

22న మండల బడ్జెట్ సమావేశం

ప్రజాశక్తి - గొల్లప్రోలు

ఈనెల 22న గొల్లప్రోలు మండల పరిషత్ బడ్జెట్ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ కె. స్వప్న ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. 22 తేదీ ఆదివారం ఉదయం 10 గంటలకు ఎంపిపి అరిగెల అచ్చియమ్మ అధ్యక్షతన మండల పరిషత్ కార్యాలయంలో జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో పలు అంశాలతో పాటు బడ్జెట్‌పై చర్చించేందుకు మండల పరిధిలోని ఎంపిటిసి సభ్యులు, నీటి సంఘం అధ్యక్షులు, మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని ఆమె కోరారు. అలాగే మధ్యాహ్నం 12 గంటలకు సహజ వనరులు –మౌలిక సదుపాయాలు – మానవ వనరులుపై సమావేశం జరుగుతుందని తెలిపారు.

బకాయి వేతనాలు చెల్లించాలి

ప్రజాశక్తి - కాకినాడ


ఇరిగేషన్ ఈస్ట్రన్ డివిజన్‌లో ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి ఇవ్వాల్సిన 11 నెలల బకాయి వేతనాలను తక్షణమే చెల్లించాలని పౌర సంక్షేమ సంఘం కన్వీనర్ దూసర్లపూడి రమణరాజు ఆదివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. పేర్కొంది. వికాస్ ద్వారా ఔట్‌సోర్సింగ్‌లో చేరి రూ.10,500లకు 11 ఏళ్ల నుంచి 200 మంది పని చేస్తున్నారని అన్నారు. వారిని ప్రభుత్వ సర్వీసులోకి చేర్చేందుకు తగిన క్రమబద్ధీకరణ చర్యలు చేపట్టాలన్నారు. కూటమి ప్రభుత్వం తక్షణమే వారికి చెల్లించాల్సిన 11నెలల బకాయి వేతనాలను విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

వృద్ధులకు భోజనాల ఏర్పాటు

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక దర్గా సెంటర్‌లో ఉన్న మన ఇల్లు ఆశ్రమ వృద్ధులకు మానవ హక్కుల సంఘం జిల్లా అధ్యక్షులు నూతలపాటి అప్పలకొండ ఆధ్వర్యంలో ఆదివారం భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అప్పలకొండ మాట్లాడుతూ దాతలు కత్తెర శ్రీను, కాశీ చంద్రావతి, గోపాల్ సహకారాలతో వీటిని ఏర్పాటు చేశామన్నారు. భవిష్యత్తులో సంస్థ తరుపున మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రధాన కార్యదర్శి కుంచే నానిబాబు, ఎస్.రెహమాన్, జుత్తుక అప్పారావు, ఎండి వల్లీభాషా, ఎండి మున్వర్, సీనియర్ న్యాయవాది మడికి రాంబాబు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



పొట్టి శ్రీరాములుకు ఘన నివాళి

జిల్లాలోని పలు కేంద్రాల్లో అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతిని పురస్కరించుకుని ఆదివారం ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అవతరణ కోసం ఆయన చేసిన త్యాగస్ఫూర్తిని వక్తలు కొనియాడారు.

ప్రజాశక్తి - యంత్రాంగం

కాకినాడ జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో స్థానిక సిబిఎం స్కూల్ రోడ్డులోని పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద ఆత్మార్పణ దినం పాటిస్తూ జిల్లా స్థాయి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి, ఎంఎల్ఎ వనమాడి వెంకటేశ్వరరావు, నగర కమిషనర్ భావన, పలువురు జిల్లా అధికారులు, పుర ప్రముఖులు పాల్గొని పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు తెలుగువారందరికీ చిరస్మరణీయుడు అని అన్నారు. ఆయన పట్టుదల, కృషి, త్యాగం ఫలితంగానే తెలుగు భాష మాట్లాడే ప్రజలు ఆత్మగౌరవంతో పురోగమించేందుకు ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటైందని తెలిపారు. ఆయన నిస్వార్థ త్యాగానికి కృతజ్ఞతగా రాష్ట్ర ప్రభుత్వం ఆయన వర్ధంతిని ఆత్మార్పణ దినంగా ప్రకటించి, ఏటా రాష్ట్రవ్యాప్తంగా శ్రద్ధాభక్తులతో పాటించడం జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో బిసి సంక్షేమ శాఖ అధికారి ఎం.లల్లి, బిసి కార్పొరేషన్ ఈడి ఎ.శ్రీనివాసరావు, యువజన సర్వీసుల శాఖ సిఇఒ కాశీ విశ్వేశ్వరరావు, అర్బన్ తహశీల్దార్ జితేంద్ర, ఎంహెచ్ఒ డాక్టర్ డి.పృథ్వీచరణ్, పలువురు అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు. **సామర్లకోట** స్థానిక మఠం సెంటర్లో పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటు కొరకు పొట్టి శ్రీరాములు చేసిన ప్రాణ త్యాగం మరచిపోలేమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ బడుగు శ్రీకాంత్, కంటే జగదీష్ మోహన్, బలుసు వాసు, మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ గోలి వెంకటఅప్పారావుచౌదరి, గోలి సత్తిరాజు, వాడపర్తి వీరభద్రరావు, తదితరులు పాల్గొన్నారు. అలాగే స్థానిక మున్సిపల్ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్య ఆధ్వర్యంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ, కౌన్సిలర్లు పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. **పెద్దాపురం** స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ కేవీ పద్మావతి అధ్యక్షతన పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ జ్యోతిరాణి, మున్సిపల్ కౌన్సిలర్ విజ్జపు రాజశేఖర్, మున్సిపల్ ఉద్యోగులు అత్తిలి వీర్రాజు, ఆకుల రామకృష్ణ, విజయకుమార్, సుబ్రహ్మణ్యం, అప్పలరాజు, గంగాధరం పాల్గొన్నారు.



సామర్లకోటలో నివాళులర్పిస్తున్న ఎంఎల్ఎ చినరాజప్ప



కాకినాడలో నివాళులర్పిస్తున్న కలెక్టర్ షాన్‌మోహన్

నేరాలు ఘోరాలు

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

ప్రజాశక్తి - జగ్గంపేట

మండలంలోని గొల్లలగుంట గ్రామంలో ఆదివారం జగ్గంపేట ఎస్ఐ రఘునాథరావు సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. ముందస్తుగా వచ్చిన సమాచారంతో పేకాట శిబిరంపై దాడి చేసి ఆరుగురు వ్యక్తులను అరెస్ట్ చేసి, వారి నుంచి రూ.11 వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పుష్కరకాలువలో పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - గండేపల్లి

మండలంలోని ఉప్పలపాడు నుంచి తాళ్లూరు వెళ్లే రహదారిలో పుష్కరకాలువలో ఒక వ్యక్తి మృతదేహం లభించింది. స్థానికులు ఇచ్చిన సమాచారంతో పోలీసులు సంఘటనా ప్రాంతానికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీశారు. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలను పోలీసులు వెల్లడించారు. ఉప్పలపాడు గ్రామానికి చెందిన లక్కాకుల వెంకటేశ్వరరావు(63) ఈ నెల 12వ తేదీన బహిర్భూమికి వెళ్లాని బయటికి వచ్చిన వ్యక్తి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు బంధువులను వాకబు చేశారు. అయినా ఫలితం లేకపోవడంతో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆదివారం ఉదయం తాళ్లూరు నుంచి ఉప్పలపాడు వెళ్లే పుష్కరకాలువలో మృతి చెందినట్లు తెలపారు ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని పెద్దాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.



వృద్ధులకు దుప్పట్లు,చీరలు పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

చీరలు, దుప్పట్ల పంపిణీ

ప్రజాశక్తి - రామచంద్రపురం

వికలాంగులు, వృద్ధులు, మహిళలకు దుప్పట్లు, చీరలను సాయి ట్రస్ట్ విశాఖపట్నం వారు పంపిణీ చేశారు. ట్రస్ట్ 15వ వార్షికోత్సవం సందర్భంగా సత్య సాయి ట్రస్ట్ ఫర్ సోషల్ వెల్ఫేర్ విశాఖపట్నంకు చెందిన శివకోటి మధు సూధనరావు ఆధ్వర్యంలో ద్రాక్షారామంలో ఆదివారం ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. భీమేశ్వర స్వామి అతిథి గృహం వద్ద ఏర్పాటు చేసిన శిబిరంలో 700 మంది వృద్ధులకు, వికలాంగులకు, మహిళలకు సుమారు రూ.3లక్షలు విలువైన చీరలు, దుప్పట్లు అందజేశారు. వారికి భోజనం, ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మధు సూదనరావు మాట్లాడుతూ ప్రతీ సంవత్సరం డిసెంబర్ నెలలో తమ బృందం 50మంది సభ్యులతో కలిసి విశాఖ నుంచి ద్రాక్షారామ వచ్చి పేదవారికి తాము సేవ చేస్తున్నామని తెలిపారు. మా సంస్థ వారు విశాఖ పట్నంలో కెజిహెచ్ వద్ద ప్రతి రోజూ 500 మందికి ఉచితంగా భోజనం ఏర్పాటు చేస్తామని తెలిపారు. నేటికి 15 సంవత్సరాలు నుంచి నిరంతరంగా మా బృందం ద్రాక్షారామ వచ్చి పేద వారికి ఉచితంగా దుస్తులు, భోజనం ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ యాట్ల అప్పారావు, దాడి భాస్కర్, పి.శ్రీనివాస్, జె.చంద్రశేఖర్, ఐ.రవికిరణ్, బి.శ్రీకాంత్, ఎస్‌విఆర్ రాజు, మైనార్టీ బిసి సంఘ నాయకులు యాట్ల నాగేశ్వరరావు, రోజా రాణి, తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఇండియన్ గ్రాండ్ మాస్టర్ గుకేష్ చిత్రం

ప్రజాశక్తి - అమలాపురం రూరల్

పాలగుమ్మి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చిత్రలేఖన ఉపాధ్యాయుడు పోలిశెట్టి నరసింహ చంద్రకుమార్ గీసిన ఇండియన్ గ్రాండ్ మాస్టర్ డి.గుకేష్ చిత్రం అందరినీ ఆకట్టుకుంది. ఈ మేరకు ఆదివారం ఆయన గుకేష్ చిత్రపటాన్ని వాటర్ కలర్స్ ఉపయోగించి వేశారు. తెలుగు తేజం దొమ్మరాజు గుకేష్ కేవలం 18 ఏళ్లకే ప్రపంచంలో అత్యంత పిన్న వయస్సులో ప్రపంచ చెస్ ఛాంపియన్ గా అవతరించి సింగపూర్ లో చరిత్ర సృష్టించి ఇండియన్ గ్రాండ్ మాస్టర్ గా నిలిచారు. రాబోయే దశాబ్దాలలో మరెన్నో విజయాలు సాధించి భారతదేశ ఖ్యాతిని మరింత పెంచాలని, అందరి ప్రశంసలు పొందాలని ఇండియన్ గ్రాండ్ మాస్టర్ దొమ్మరాజు గుకేష్ కు నా చిత్రాభినందన అంటున్నారు. ఈ చిత్రం అందరిని ఆకట్టుకుంది.

బాధితుడికి ఎంఎల్ఎ పరామర్శ

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితుని సిటీ ఎంఎల్ఎ ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) ఆదివారం పరామర్శించారు. స్థానిక 11వ డివిజన్ విఎల్ పురం స్కూల్ వీధిలో టైలర్ మల్లిబాబుకు చెందిన దుకాణం షార్ట్ షర్క్యూట్ కారణంగా దగ్ధం అయ్యింది. విషయం తెలుసుకున్న ఎంఎల్ఎ ఆదిరెడ్డి శ్రీనివాస్ సంఘటనా స్థలాన్ని సందర్శించారు. బాధితునికి ప్రభుత్వ పరంగా నష్ట పరిహారం వచ్చేలా చూస్తామన్నారు.

ఆలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

చివటంలో శిథిలావస్థకు చేరుకున్న పుంతలో ముసలమ్మ, కనకదుర్గమ్మ అమ్మవార్ల ఆలయ పునర్నిర్మాణానికి ఆదివారం శంకుస్థాపన చేశారు. గ్రామానికి చెందిన గమిడి భాస్కరరావు కుటుంబ సభ్యులు గమిడి రామ నాగేశ్వరరావు, వెంకట సీతాసుగుణ, శ్రీను, శ్యామల, చలంచర్ల శ్రీనివాసు, దేవి దంపతులు శంకుస్థాపన, విగ్రహావిష్కరణ కోసం అందజేసిన సుమారు రూ.3 లక్షల సాయంతో ఆలయ నిర్మాణం ప్రారంభించారు. శిథిలావస్థకు చేరుకున్న ఆలయం ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న కారణంగా, రోడ్డు విస్తరణ పనుల నిమిత్తం శిథిలావస్థకు చేరుకున్న దేవాలయాన్ని తొలగించి, నూతన ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. రూ.25 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న ఈ కార్యక్రమంలో ఎంపిటిసి వేముల వెంకట సత్యనారాయణ, చిలుకూరి శ్రీనివాస్, కూనపరెడ్డి రంగా, గంటిన వెంకన్న, దాసరి మునీశ్వరావ్, అబ్బిరెడ్డి శివ సతీష్, కొండదాసు ఫణి దినేష్, ఎం.మురళీకృష్ణ, సాలాపు వెంకటేష్, మడిపల్లి రిషి, ఎన్.వీర్రాజు పాల్గొన్నారు.

డిసి ఛైర్మన్ ఎవరికో..?

-జెంటిల్‌మెన్ ఒప్పందంపై అనుమానాలు

-తాళ్లరేవుకే కేటాయించాలని రైతుల విజ్ఞప్తి

ప్రజాశక్తి - తాళ్లరేవు

సాగు నీటి వినియోగదారుల సంఘాలు ఎన్నికలు ముగిశాయి. ఆయా నీటి సంఘాల పరిధిలో డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఛైర్మన్, వైస్ ఛైర్మన్‌ల ఎన్నిక ఈ నెల 17న నిర్వహించేందుకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేస్తుంది. అయితే డెల్టా ప్రాజెక్టు పరిధిలోని కాజులూరు మండలంలోని జగన్నాథగిరి ఇరిగేషన్ సెక్షన్‌లో కాజులూరు, కరప మండలం సిరిపురం డిస్ట్రిబ్యూటరీ కమిటీలు ఉన్నాయి. తాళ్లరేవు మండలం పటవల నీటి వినియోగదారుల సంఘం కాజులూరు డిసి పరిధిలో ఉంది. నీటి సంఘాలు ఏర్పడినప్పటి నుంచి గతంలో ఉమ్మడిగా ఉన్న సిరిపురం డిసికి గరికపాటి సూర్యనారాయణచౌదరి ఛైర్మన్‌గా ఎన్నికయ్యారు. అనంతరం కాజులూరు మండలం జగన్నాథగిరి పరిధి వేరు కావడంతో తాళ్లరేవు మండలం పటవల నీటి నీటి సంఘం నుంచి అధ్యక్షునిగా ఎన్నికైన వత్సవాయి సీతారామరాజు కాజులూరు డిసి ఛైర్మన్‌గా ఎన్నికయ్యారు. అనంతరం రెండు పర్యాయాలు కాజులూరు మండలానికే చెందిన పిల్లారిశెట్టి కొండబాబు, తలాటం వెంకటేశ్వరరావు డిసి ఛైర్మన్‌లుగా ఎంపికయ్యారు. రొటేషన్ పద్ధతిలో 2 దఫాలు డిసి ఛైర్మన్ పదవి కాజులూరుకు ఇస్తే ఒకసారి డిసి ఛైర్మన్ పదవిని తాళ్లరేవుకు ఇవ్వడం సాంప్రదాయం. ఈ దఫా ఛైర్మన్ పదవి తాళ్లరేవు మండలం పటవలకు దక్కాల్సి ఉంది. శివారు ప్రాంతమైన తాళ్ళరేవు మండలం పటవల టైలాండ్ కావడం, సౌడు భూములు కావడంతో పటవలకు డిసి ఛైర్మన్ ఇస్తే శివారు ప్రాంతాలకు సాగునీటి ఎద్దడి లేకుండా నివారించేందుకు ఛైర్మన్ కృషి చేస్తారనే అభిప్రాయం స్థానిక రైతుల్లో వ్యక్తం అవుతోంది. ఈ నేపథ్యంలో ఈ నెల 17న జరిగే డిసి ఛైర్మన్ పదవి విషయంలో గతంలో జరిగిన జంటిల్మన్ ఒప్పందం ప్రకారం జరుగుతుందా? అనే ప్రశ్నలు వ్యక్తం అవుతున్నాయి. పటవల నీటి సంఘం అధ్యక్షునిగా ఎన్నికైన కొత్తూరు కాశీ ఈశ్వరుడుకి డిసి ఛైర్మన్ పదవి అప్పగించేందుకే ఆయనకు పోటీలో నిలిచిన భజన సత్తిబాబును ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు బుజ్జగించి పోటీ లేకుండా చేశారు. అయితే కాజులూరు మండలంలో జనసేన పార్టీ నుంచి లకాని కృష్ణచైతన్య డిసి ఛైర్మన్ పదవిని ఆశిస్తున్నారు. అదేవిధంగా మండలానికి చెందిన శలపాక నీటి సంఘం అధ్యక్షులుగా ఎన్నికైన తాడి మాసారెడ్డి డిసి ఛైర్మన్ పదవిని ఆశిస్తున్నారు. అందుకు అధిష్టానం ఆశిస్సుల కోసం అమరావతిలో చక్రం తిప్పుతున్నారనే చర్చ సాగుతోంది. ఈ ముగ్గురు మధ్య పోటీ నెలకొనడంతో కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు ఎవరికి ఓటు వేస్తారనేది తెలియాల్సివుంది.

కాశీకి డిసి ఛైర్మన్ ఇవ్వాలి

జగన్నాథగిరి ఇరిగేషన్ సెక్షన్ పరిధిలోని డిసి ఛైర్మన్ పదవిని మండలం పటవల గ్రామానికి చెందిన కొత్తూరు కాశీ ఈశ్వరుడుకి కేటాయించాలని స్థానిక రైతులు వెలుగుబంటి గోవిందరావు, యన్నపు శ్రీనివాస్, కడియాల అప్పారావు, మేడిశెట్టి గోపాలకృష్ణ, ఎం.గోపాల్, గుండుపల్లి గోపాలకృష్ణ, మేకల గోపాలకృష్ణ కోరారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ కాజులూరు డిసి పరిధిలో శలపాక, మంజేరు, గొల్లపాలెం, కాజులూరు, దుగ్గుదూరు, పటవల నీటి సంఘాలు ఉన్నాయన్నారు. జెంటిల్మెన్ ఒప్పందం ప్రకారం ఈ దఫా తాళ్లరేవు మండలానికి కేటాయించాలని, డిసి ఛైర్మన్ పదవిని కాశీ ఈశ్వరుడికి ఇవ్వాలని వారు కోరారు.

క్రీడలు శారీరక, మానసిక ఆరోగ్యానికి దోహదం

ప్రజాశక్తి - గండేపల్లి




ఎస్‌పి విక్రాంత్ పాటిల్‌కు స్వాగతం పలుకుతున్న ఆదిత్య విద్యా సంస్థల అధినేత శేషారెడ్డి

క్రీడలతో శారీరక, మానసిక ఆరోగ్యం లభిస్తుందని ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. ఆదివారం సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ గ్రౌండ్స్‌లో జర్నలిస్ట్స్ స్పోర్ట్స్ అసోసియేషన్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం వార్తల సేకరణలో బిజీగా ఉంటూ వత్తిడితో జీవించే జర్నలిస్టులకు ఇలా క్రీడా పోటీలు ఉత్తేజాన్ని ఇస్తాయన్నారు. జర్నలిస్టులు నిష్పక్షపాతంగా వార్తలు రాయాలని ఆయన కోరారు. కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి మాట్లాడుతూ గెలుపు, ఓటములు కొలబద్ధగా కాకుండా స్నేహపూర్వక వాతావరణంలో ఈ పోటీలు జరగాలని ఆకాంక్షించారు. ఎస్‌పి విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ జర్నలిస్టులు ఎప్పుడూ విధి నిర్వహణలో బిజీగా ఉంటారని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులను ఒకే వేదికగా మీదకు తీసుకొచ్చి క్రీడలు ఆడటం ఆనందంగా ఉందన్నారు. ఆదిత్య యూనివర్సిటీ ఛైర్మన్ నల్లమిల్లి శేషారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి జర్నలిస్ట్స్ క్రికెట్ టోర్నీకి ఆతిథ్యం ఇవ్వడం తమ అదృష్టంగా భావిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకురాలు కృష్ణప్రియ, పెద్దాపురం మున్సిపల్ మాజీ ఛైర్మన్ రాజా సూరిబాబు రాజు మాట్లాడారు. ఆదిత్య యూనివర్సిటీ డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి, జర్నలిస్ట్ స్పోర్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఓబులం ప్రసాద్, గౌరవ అధ్యక్షులు బోళ్ళ సతీష్‌బాబు, ప్రచార కార్యదర్శి తలారి నాగలింగస్వామి, గౌరవ సలహాదారు అజయ్ ఇండియన్, అసోసియేషన్ నాయకులు తలారి రెడ్డప్ప, డిహెచ్‌వి. సాంబశివరావు, సిద్ధు, లోవరాజు, సూరిబాబు, వెలుగూరి రవి, వెంకటరత్నం, రాజేంద్ర, వేణుగోపాల్, నాగవర్ధన్ రెడ్డి, సురేంద్ర, కిషోర్, తదితరులు పాల్గొన్నారు. స్టేట్ -ఎ, ఈస్ట్ గోదావరి -బి, స్టేట్ -బి, ఈస్ట్ గోదావరి -ఎ జట్ల మధ్య పోటీలు ఆసక్తికరంగా సాగాయి. విన్నర్స్ రాయలసీమ స్టేట్ బి రన్నర్స్ ఉభయగోదావరి జట్లు నిలిచాయి.

ముద్రగడను కలిసిన పిల్లి బోస్

ప్రజాశక్తి - ప్రత్తిపాడు



ముద్రగడతో మాట్లాడుతున్న ఎంపి పిల్లి బోస్

మాజీ మంత్రి, వైసిపి నాయకులు ముద్రగడ పద్మనాభం, వైసిపి ప్రత్తిపాడు నియోజకవర్గ కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబును రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్ చంద్రబోస్ కిర్లంపూడిలో మర్యాదపూర్వకంగా ఆదివారం కలిశారు. ఈ సందర్భంగా కొంతసేపు తాజా రాజకీయ పరిణామాలపై చర్చించుకున్నారు. అనంతరం పిల్లి సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతూ ప్రత్తిపాడు వైసిపి కోఆర్డినేటర్‌గా నియమితులైన ముద్రగడ గిరిబాబును కలవడానికి వచ్చానన్నారు. గత ఎన్నికల్లో పార్టీకి ఎంతో శ్రమించిన ముద్రగడను తగిన గుర్తింపుగానే ఆయన కుమారుడికి కో-ఆర్డినేటర్ పదవిని వైసిపి అధినేత జగన్మోహన్ రెడ్డి కట్టబెట్టారని అన్నారు నియోజకవర్గంలో పార్టీ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నో హామీలు ఇచ్చి అమలు చేయలేక ప్రభుత్వం చేతులెత్తేసిందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు.

చలో గుంటూరుకు తరలిన కార్యకర్తలు

ప్రజాశక్తి - పెద్దాపురం, తాళ్లరేవు



పెద్దాపురంలో నినాదాలు చేస్తున్న మాలల ప్రతినిధులు

ఈనెల 15న జరిగే చలో మాల చలో గుంటూరు కార్యక్రమానికి పట్టణం నుంచి ఆదివారం మాలల ఐక్యవేదిక ద్వారా కార్యకర్తలు గుంటూరుకు తరలివెళ్లారు. యాకోబు, లక్ష్మణ్, దావీదు, జాలా కామరాజు, బేదంపూడి చిన్న సత్తిబాబు ల ఆధ్వర్యంలో కార్యకర్తలు వాహనాలపై తరలి వెళ్లారు. అలాగే తాళ్లరేవు మండలం నుంచి మాలలంతా మాలల మహాగర్జనకు పెద్ద ఎత్తున ప్రజలు తరలి వెళ్లారు. సుంకరపాలెం బైపాస్ జంక్షన్ నుంచి నినాదాలు చేస్తూ బస్సులలో బయలుదేరారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు మండల అధ్యక్షులు దున్న మురళి, కెవిపిఎస్ మండల అధ్యక్షులు విప్పర్తి శ్రీనివాసరావు, పొలేకుర్రు సర్పంచ్ వెంటపల్లి నూకరాజు, మాజీ సర్పంచ్ దడాల బుజ్జిబాబు, కాశి లక్ష్మణస్వామి, జక్కల ప్రసాద్ బాబు, దున్న సుబ్రహ్మణ్యం, మోర్త అర్జునరావు, పెయ్యల కొండబాబు, దాసరి వేణుగోపాల్, వస్కా రెడ్డి, పలు సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



తాళ్లరేవులో నినాదాలు చేస్తున్న మాలలు



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న సూర్యనారాయణ

నూతన సంవత్సరాన్ని మద్యంతో జరుపుకోవద్దు

ప్రజాశక్తి - గొల్లప్రోలు

నూతన సంవత్సర వేడుకలను మద్యం, ఇతర మాదకద్రవ్యాలతో జరుపుకోవద్దని మద్యపాన వ్యతిరేక ప్రచార కమిటీ జిల్లా కన్వీనర్ ఎన్.సూర్యనారాయణ అన్నారు. మండలంలోని వన్నెపూడి గ్రామంలో జనవిజ్ఞాన వేదిక, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత నూతన సంవత్సరాన్ని మద్యం, ఇతర మాదకద్రవ్యాల మత్తులో నిర్వహించుకుంటే రోడ్డు ప్రమాదాల భారిన పడే అవకాశం ఉందన్నారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు కుటుంబంతో కలిసి ఆటలు పాటలతో జరుపుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక, ప్రజా సంఘాల నాయకులు కూరాకుల సింహాచలం, వర్ధనపు నాగేశ్వరరావు, ఎస్.సత్యనారాయణ, ఏలేటి నానిబాబు పాల్గొన్నారు.



బాధితులకు ఆర్థిక సాయాన్ని అందిస్తున్న ముదునూరి

గిరిజన ప్రాంతాల్లో సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

గిరిజన ప్రాంతాల్లో ఉన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని వైసిపి నాయకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలో కిత్తమూరిపేట, పెద్దిపాలెం గ్రామాల్లో అనారోగ్యంతో బాధపడుతున్న ఐదు కుటుంబాలకు ముదునూరి మురళీకృష్ణంరాజు చారిటబుల్ ట్రస్ట్ తరపున ఆర్థిక సాయాన్ని ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి పాలనలో గిరిజనులకు అనేక సంక్షేమ పథకాలు అమలు అయ్యాయని అన్నారు. కూటమి ప్రభుత్వంలో గిరిజనులకు సంక్షేమ పథకాలు అందడం లేదన్నారు. రహదారుల సదుపాయం లేక గిరిజనులు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని అన్నారు. పెద్దిపాలెం పిహెచ్‌సికి గిరిజనులు వచ్చేందుకు అవసరమైన రహదారిని తక్షణమే నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దేవర లక్ష్మణ్, లోండ బాబులు, మేకా చంటిబాబు, విత్తనాల నాగేశ్వరావు, ఉప సర్పంచ్ చెల్లారావు పాల్గొన్నారు.

మరిడమ్మ ఆలయంలో అన్నదానం

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక మరిడమ్మ అమ్మవారి ఆలయంలో ఆదివారం యాత్రికులకు అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రతి ఆదివారం అమ్మవారిని దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చే యాత్రికులకు అన్నదానం నిర్వహిస్తున్నామన్నారు. ఈ అన్నప్రసాద వితరణలో రాయ రామచంద్రప్రసాద్, రాయ వినయ్‌కుమార్, వేద పండితులు ప్రసాద శర్మ, ఎన్‌వి శాస్త్రి, సిబ్బంది వెంకటరమణ, వరహాలు, లోవ, శివ పాల్గొన్నారు.

కుడా ఛైర్మన్‌కు ఘన స్వాగతం

ప్రజాశక్తి - పెద్దాపురం, సామర్లకోట



సామర్లకోటలో స్వాగతం పలుకుతున్న కార్యకర్తలు

కాకినాడలో ఆదివారం జరిగిన కుడా ఛైర్మన్ ప్రమాణస్వీకారోత్సవానికి మండలంలోని పలు గ్రామాల నుంచి కూటమి నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. కుడా ఛైర్మన్ తుమ్మల రామస్వామి ఆధ్వర్యంలో ఆయన స్వగ్రామం పులిమేరు నుంచి జనసేన నాయకులు, కార్యకర్తలు, కూటమి నాయకులు పెద్దఎత్తున ర్యాలీగా తరలివెళ్లారు. అలాగే కుడా ఛైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసేందుకు భారీ కాన్వాయ్‌తో వెళ్లిన తుమ్మల రామస్వామికి స్థానిక గాంధీ బొమ్మ సెంటర్ వద్ద టిడిపి, జనసేన నాయకులు ఘనస్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కంటే జగదీష్ మోహన్‌బాబు, గోలి వెంకట అప్పారావు చౌదరి, గోలి సత్తిరాజు, యార్లగడ్డ రవిచంద్ర ప్రసాద్, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పెద్దాపురంలో ర్యాలీగా వెళ్తున్న తుమ్మల బాబు

కెఎఫ్‌సిఎల్ చెక్‌పోస్టులో జెసి తనిఖీలు

ప్రజాశక్తి - కాకినాడ



కంటైనర్ నుంచి శాంపుల్స్‌ను సేకరణను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్

కాకినాడ సీ పోర్టు లిమిటెడ్ 2వ గేట్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన చెక్ పోస్ట్ వద్ద ఆదివారం జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో భాగంగా కెఎఫ్‌సిఎల్ పోర్టులో ఉన్న ఉషశ్రీ ట్రేడర్స్‌కు చెందిన స్టఫ్డ్ రైస్ కంటైనర్ల నుంచి చెక్ పోస్ట్ టీమ్‌తో నమూనాలు సేకరించి పరీక్షలు చేయించారు. ఈ నమూనాల పరీక్షలలో ఫోర్టిఫైడ్ రైస్ కెర్నల్స్ లేనందున కంటైనర్లలోని బియ్యం పిడిఎస్ బియ్యం కావని నిర్ధారించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల భద్రత నిమిత్తం ప్రతినెలా పంపిణీ చేస్తున్న బియ్యాన్ని రీసైక్లింగ్ చేసి అక్రమ ఎగమతులు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. తనిఖీలు పటిష్టంగా నిర్వహించేందుకు ఇటీవల నూతనంగా మరొక చెక్ పోస్టును కెఎఫ్‌సిఎల్ వద్ద ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ చెక్ పోస్ట్ ల వద్ద సుశిక్షితులైన సిబ్బంది తనిఖీలు నిర్వహించిన అనంతరం వాహనాలకు గేట్ పాస్ ద్వారా అనుమతి ఇవ్వడం జరుగుతుందన్నారు. చెక్ పోస్ట్ వద్ద 24 గంటలు మూడు షిఫ్ట్ లలో రెవెన్యూ, పౌరసరఫరాల శాఖలకు చెందిన అధికారులతో కూడిన బృందం తనిఖీలు నిర్వహించి నమూనాలు సేకరించడం జరుగుతుందన్నారు. అనుమానిత నమూనాలను విశ్లేషణ నిమిత్తం పౌరసరఫరాల శాఖ జిల్లా ల్యాబ్ కు పంపించడం జరుగుతుందని తెలిపారు. ఈ తనిఖీల్లో డిఎస్‌పి రఘువీర్ విష్ణు, జిల్లా పౌరసరఫరాల శాఖ ఇన్‌ఛార్జ్ అధికారి ప్రసన్న లక్ష్మీదేవి, పోర్టు అధికారులు, పౌర సరఫరాల సిబ్బంది పాల్గొన్నారు.



జ్యోతిప్రజ్వలన చేస్తున్న ఎంఎల్ఎలు నెహ్రూ, సత్యప్రభ

దేవర్ష ఆసుపత్రి సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

గత కొన్ని సంవత్సరాలుగా ప్రత్తిపాడులో దేవర్ష ఆసుపత్రి అందిస్తున్న సేవలు అభినందనీయమని ఎంఎల్ఎలు జ్యోతుల నెహ్రూ, వరుపుల సత్యప్రభ అన్నారు. ఆదివారం దేవర్ష మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేవర్ష ఆసుపత్రి వైద్యులు డాక్టర్ అంజినాయక్, డాక్టర్ విజయ పట్టణాల్లో కార్పొరేట్ ఆసుపత్రిలో ఏవిధంగా సదుపాయాలు ఉన్నాయో అన్ని సదుపాయాలతో మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిని ప్రత్తిపాడులో ప్రారంభించడం అభినందనీ యమన్నారు. చుట్టుపక్కల గ్రామీణ ప్రాంతాల వాసులకు దూర ప్రాంతాలు వెళ్ళకుండా దగ్గరలో మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి రావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. దేవర్ష ఆస్పత్రి అధినేతలు డాక్టర్ అంజి నాయక్, డాక్టర్ విజయ చుట్టుపక్కల గ్రామీణ ప్రాంత వాసులకు అందిస్తున్న వైద్య సేవల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అతిథులను ఆసుపత్రి యాజమాన్యం ప్రతినిధులు జ్ఞాపకలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కొమ్ముల కన్నబాబు, యాళ్ల జగదీష్, తదితరులు పాల్గొన్నారు.



ఎంఇఒ డేవిడ్‌ను సత్కరిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

ప్రయివేటు పాఠశాలలు నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి - కాజులూరు

ప్రయివేట్ పాఠశాలలు నిబంధనలను కచ్చితంగా పాటించాలని ఎంఇఒ డేవిడ్ అన్నారు. ఆదివారం కాజులూరు కోటి ఉన్నత పాఠశాలలో ప్రయివేట్ పాఠశాలల కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికయింది. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రయివేటు పాఠశాలు ప్రభుత్వ పాఠశాలలకు ధీటుగా పనిచేస్తున్నాయని, అయితే నిబంధనలు కచ్చితంగా పాటించవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అనంతరం ప్రయివేటు పాఠశాలల అసోసియేషన్ అధ్యక్షులుగా కాదా కోటేశ్వరరావు, కార్యదర్శిగా స్టీఫెన్‌బాబు, కోశాధికారిగా డేగల రాంబాబు ఎంపికయ్యారు. ఎంఇఒను ఘనంగా సత్కరించారు.

మినీ గోకులాల ఏర్పాటుకు ఆసక్తి

ప్రజాశక్తి - తొండంగి

మినీ గోకులాలు ఏర్పాటు చేసుకునే పథకానికి రైతులు ఆసక్తి చూపుతున్నారని శృంగవృక్షం పశు వైద్యాధికారి నరసింహం అన్నారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ తన సెక్టార్‌కి 8 గోకులం షెడ్లు మంజూరు అయ్యాయని, వాటిలో శృంగవృక్షం, కొమ్మనాపల్లి, ఎ.కొత్తపల్లి, అగ్రహారం, సీతారాంపురం గ్రామాల్లో ఎస్‌సి, ఎస్‌టి, బిసి సామాజికవర్గాలకు చెందిన రైతుల ను ఎంపిక చేశామన్నారు. లబ్ధిదారుడు స్థలాన్ని బట్టి 6 గాని 8 పశువులతో పాటు, రేకుల షెడ్లు నిర్మించుకోవడానికి ప్రభుత్వం సహకరిస్తుందన్నారు. ఎవ రైనా రైతులు 10 సెంట్లు నుంచి 5 ఎకరాలు స్థలంలో గడ్డిని పెంచేందుకు ప్రభు త్వం సహకారం అందిస్తుందన్నారు. అంతేగాక పెంచిన గడ్డిని కొనుగోలు చేస్తుం దని, ఆసక్తిగల రైతులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.




సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షులు కృష్ణయ్య

ఉపాధ్యాయులపై యాప్‌ల భారం తగ్గించాలి

ప్రజాశక్తి - మామిడికుదురు

ఉపాధ్యాయులపై యాప్ ల భారం తగ్గించాలని రాష్ట్ర అధ్యక్షులు మిట్టా కృష్ణయ్య అన్నారు. ఆదివారం మామిడికుదురు హైస్కూల్ ప్రాంగణంలో పిఆర్‌టియు అంబేడ్కర్ కోనసీమ జిల్లా విద్యా సదస్సు, కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. జిల్లా అధ్యక్షులు దీపాటి సురేష్‌బాబు అధ్య క్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులకు ఐఆర్30 శాతం ప్రకటించాలని, హిందీ, ఇంగ్లిష్ సిలబస్ తగ్గించాలని డిమాండ్ చేశారు. రిటైర్డ్ జిల్లా ఉప విద్యాశాఖ అధికారి మైలవర్ అప్పు రవీంద్రనాథ్ విద్యా సదస్సు లో ప్రస్తుత విద్యారంగం ఎదుర్కొంటున్న సవాళ్ల అంశం పై ప్రసం గించారు. అనంతరం పిఆర్‌టియు రిటైర్డ్ ఉపాధ్యాయులకు సన్మానం చేశారు. అనంతరం జిల్లా నూతన కార్యవర్గం ఎన్నికలు నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు నరాల కృష్ణ కుమార్, రాష్ట్ర కార్యదర్శి కంకటాల చంద్రశేఖర్, రాష్ట్ర కౌన్సిలర్ పంగం బ్రహ్మాజీరావు, మామిడికుదురు మండల శాఖ అధ్యక్షులు యాల పల్లంరాజు, మండల కార్యదర్శి చింతా రమేష్, మండల ఆర్థిక కార్యదర్శి కడలి వెంకట దుర్గాప్రసాద్, మండల విద్యాశాఖ అధికారి 2. మోకా వెంకన్నబాబు, హై స్కూల్ హెచ్ఎం సిహెచ్ నిరంజని తదితరులు పాల్గొన్నారు.



వికలాంగులకు ట్రై సైకిళ్లను అందజేస్తున్న ఎంఎల్ఎ సత్యానందరావు

వికలాంగుల సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి - ఆలమూరు

వికలాంగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని కొత్తపేట ఎంఎల్ఎ బండారు సత్యానందరావు అన్నారు. విపిపిఎస్ గ్రూపు అధ్యక్షులు మామిడిశెట్టి వెంకటరమణారావు, మండల గ్రూప్ అధ్యక్షులు సోము పోతురాజు, గ్రూప్ ఉపాధ్యక్షులు ద్వారంపూడి గోపాలకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో చొప్పెల్ల తక్షశిల స్కూల్ ఆవరణలో వికలాంగుల పరిరక్షణ సమితి ఏర్పాటు చేసిన వికలాంగుల అంతర్జాతీయ దినోత్సవ వారోత్సవాల వేడుకలలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వికలాంగులకు ప్రభుత్వం పెంచిన పింఛను, ఇళ్ల స్థలాలు, రేషన్ కార్డులు, రైల్వే పాసులు, బ్యాక్లాగ్ పోస్టులు, ఎదుర్కొంటున్న ఇబ్బందులు, ట్రై సైకిల్ తదితర అంశాలపై వారితో చర్చించారు. ముఖ్యంగా కుటుంబ సభ్యులకు ఎవరికైనా కార్లు ఉంటే పింఛను తొలగించవద్దని, పుట్టుకతోనే పూర్తి వికలాంగులుగా ఉన్న వారిని గుర్తించి వారికి నూరు శాతం పెన్షన్ సదుపాయం కల్పించాలని వికలాంగులు ఎంఎల్ఎను కోరారు. అలాగే వికలాంగులు తమ న్యాయమైన కోర్కెలు తీర్చాలని ప్రభుత్వాన్ని కోరుతూ ఎంఎల్ఎకు వినతి పత్రం అందజేశారు. దీనిపై ఆయన స్పందిస్తూ కూటమి ప్రభుత్వం మీకోసం ఎన్నో ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తుందని, మీరు అడిగిన ప్రతి విషయాన్ని అసెంబ్లీలో చర్చిస్తానని తెలిపారు. అనంతరం ఆయన అర్హులకు మంజూరైన ట్రై సైకిల్స్, బస్సు పాసులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిసిఎంఎస్ మాజీ ఛైర్మన్ కెవి.సత్యనారాయణరెడ్డి, నీటి సంఘం అధ్యక్షులు మెర్ల గోపాలస్వామి, డిసి మాజీ అధ్యక్షులు నాగిరెడ్డి వెంకటరత్నం, కూటమి నేతలు సుఖమల్ల రాముడు, జాంపోలు వెంకట్రావు, బల్ల హరికృష్ణ, కొత్తపల్లి రామ కృష్ణ, సిరంగులసతీష్, నాగిరెడ్డి రామకష్ణ తదితరులు పాల్గొన్నారు.